డా॥ బి. వి. పట్టాభిరామ్

# ఎదగడానికి 7 మెట్లు

7

ఆత్మవిశ్వాసం

స్వయంకృషి


దేశభక్తి

ఆత్మాభిమానం

మనోబలం

పట్టుదల

క్రమశిక్షణ



ఎమెస్కో

## ఆత్మవిశ్వాసం

Scanned with CamScanner

# ఆత్మవిశ్వాసం

అనగా అనగా... మనదేశంలోని మహారాష్ట్రలో అంబవడే అనే గ్రామంలో రాంజీ శకపాల్, భీమాబాయి అనే దంపతులు ఉండేవారు. రాంజీ సైన్యంలో చిన్న ఉద్యోగం చేసేవాడు. వారికి 14మంది సంతానం. వారిలో ఆఖరి పిల్లవాడే మన కథానాయకుడు అంబేద్కర్. అతని అసలు పేరు భీమ్‌రావ్ రాంజీ అంబావడేకర్.

అతను మహర్ అనే కులంలో పుట్టాడు. ఆ రోజుల్లో అంటరానితనం అనే దురాచారం ఎక్కువగా ఉండేది. మహర్ కులం వాళ్ళని అంటరానివారుగా చూసేవారు.



Scanned with CamScanner

మహర్ కులంవాళ్ళు ఎక్కువగా సైన్యంలో చేరేవారు. వాళ్ళకు వీరసైనికులుగా, మంచి ధైర్య సాహసాలు కలవాళ్ళుగా పేరుండేది.


అయినా సమాజంలోని తక్కిన కులాలవాళ్ళు వీళ్ళతో కలిసి భోజనం చెయ్యడం, కలిసి తిరగడంవంటివి చేసేవాళ్ళుకాదు. ఈ విషయం మన అంబేద్కర్‌ను చిన్నతనంలో చాలా బాధించేది.





పాఠశాలలో చదువుకుంటున్న భీమ్‌రావ్‌కి తోటి విద్యార్థులతో కూడా కుల సమస్యలు తలెత్తేవి. తోటి విద్యార్థులు అతనితో కలిసి తిరిగేవారు కాదు. ఎన్నో అవమానాలకు గురిచేసేవారు. ప్రక్కన కూర్చోబెట్టు కోవడానికి ఇష్టపడేవారుకాదు. కలిసి భోజనం చేసేవారు కాదు. ఆటల్లో దూరంగా పెట్టేవారు. ఏ అవకాశం దొరికినా కులం పేరుతో అవమానపరచేవారు.


అయినా భీమ్‌రావ్ ఎప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. ఎంతో సహనంతో ఉండేవాడు. చదువులో అందరికన్నా ముందుండటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు.



Scanned with CamScanner


తెలియని విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకునేవాడు. ఏ విషయాన్నైనా చాలా తేలికగా అర్థం చేసుకునేవాడు. భీమ్‌రావ్ చదువులో ఎప్పుడూ మొదటి శ్రేణిలోనే ఉండేవాడు.

ఆ సమయంలో అంబేద్కర్ అనే ఒక ఉపాధ్యాయుడు ఉండేవాడు. ఆయన భీమ్‌రావ్ తెలివితేటలను చూసి మెచ్చుకుని ప్రత్యేక శ్రద్ధ చూపించేవాడు. ఆ అభిమానంతోనే భీమ్‌రావ్ రాంజీ అంబావడేకర్ అనే తనపేరుని అంబేద్కర్ అని మార్చుకున్నాడు.



ఆత్మవిశ్వాసం ఉంటే ఎన్ని అవాంతరాలైనా అవలీలగా దాటవచ్చు అనే విషయం అంబేద్కర్ నమ్మాడు.


1908లో అతను మెట్రిక్ పరీక్ష పాసయ్యి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. వారికులంలో అలా మెట్రిక్ పాసయిన మొదటి వ్యక్తి అతనే. ఆ సందర్భంలో వారంతా సన్మానం కూడా చేసారు.



Scanned with CamScanner

చదువులో విజయం అక్కడితో ఆగలేదు. అతని తెలివితేటలకు మెచ్చి బరోడా మహారాజు ఉపకారవేతనం ఇవ్వటానికి అంగీకరించాడు. కాలేజీలో చేరి 1912లో బి.ఎ. పాసయ్యాడు. అది కూడా ఆ రోజుల్లో ఒక విశేషమే.


బరోడా రాజుగారు మెచ్చుకుని తన సంస్థానంలో లెఫ్టినెంటుగా నియమించుకున్నారు. ఉద్యోగం మంచిదేకాని, కులపిశాచి అక్కడ కూడా ఉంది. సాటి ఉద్యోగులు తక్కువగా చూసేవారు. ఇల్లుకూడా దొరకటం కష్టమైంది. అయినా అతను నిరుత్సాహపడలేదు.



Scanned with CamScanner


ఏదిఏమైనా, నేను కుల పిశాచిని అంతమొందించాలి. దీనికి చదువొక్కటే మార్గం, ఎన్ని అవాంతరాలొచ్చినా, అవమానాలెదురైనా ఆగను' అని నిర్ణయించుకున్నాడు. ఆ సమయంలో రాజుగారు విదేశాల్లో చదువు కోవాలనుకునే విద్యార్థులకు సహాయం చేయాలని నిర్ణయించారని తెలిసింది.

"ఆ అవకాశం నాకెందుకు వస్తుందిలే" అని అంబేద్కర్ అనుకోలేదు. అందరికన్నా ముందు నాకే వస్తుంది అనుకున్నాడు. చివరకు అదే జరిగింది. 1913వ సంవత్సరంలో అమెరికా లోని కొలంబియా విశ్వ విద్యాలయంలో చేరాడు.



Scanned with CamScanner


అమెరికాలో ఉన్నప్పటికీ భారతదేశంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండేవాడు. భారతదేశం అభివృద్ధి చెందాలని కలలు కనేవాడు. భారతీయులంతా విద్యావంతులు కావాలని అనుకునేవాడు. కులాలు, మతాలు మనుషులను విడదీయరాదని కోరుకునేవాడు. చదువులేకపోవడంవల్లే అంటరానితనం సమస్యగా మారిందని భావించేవాడు.



Scanned with CamScanner

విశ్వవిద్యాలయంలో ఎంతోబుద్ధిగా చదువుకున్నాడు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, రోజూ 18 గంటలు చదువుతూ ఎమ్.ఎ. పూర్తిచేసి 1917లో ప్రతిష్టాత్మకమైన పిహెచ్.డి. పట్టాన్ని పొందాడు. ఆ తరువాత లండన్లో బారిస్టరు పరీక్ష కూడా పాసయ్యి అందరినీ ఆశ్చర్యపరిచాడు.


ఆకాలంలో అంత చదువు చదవటం మామూలు విషయంకాదు. ఆత్మవిశ్వాసంతో ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని అంబేద్కర్ రుజువు చేశాడు.



Scanned with CamScanner


ఆ తరువాత బొంబాయి వచ్చి న్యాయవాద వృత్తి ప్రారంభించాడు. కులాలపేరుతో వెనుకబడినవారందరికీ సమాజంలో తగిన స్థానం కల్పించాలనే సంకల్పంతో నడుం బిగించాడు. 1924లో బహిష్కృత హితకారిణి సభను స్థాపించి, దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వారికి న్యాయం చేయించాడు.

సమాజంలో కులాలన్నీ మనం ఏర్పరచుకున్నవే. మనందరి రక్తం ఎర్రగానే వుంటుంది. మనమంతా కలిసి పనిచేస్తే దేశం అభివృద్ధి చెందుతుంది. అని అంబేద్కర్ చెప్పేవాడు.



Scanned with CamScanner


ఇక విజయపరంపర అక్కడ నుండి నిరంతరంగా కొనసాగింది. బ్రిటీషు ప్రభుత్వం కూడా ఆయన సేవలను గుర్తించి మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతినిధిగా ఆహ్వానించారు. ఆపైన రెండవ రౌండ్ టేబుల్ సమావేశంలోకూడా స్థానం లభించింది. మహాత్మాగాంధీ, మదనమోహన మాలవ్యాలు కూడా అంబేద్కర్‌లోని మేధాశక్తిని గుర్తించారు. అంబేద్కర్‌లాంటి మేధావి దేశానికి అవసరమని వారు భావించారు.



Scanned with CamScanner

అంబేద్కర్‌లో ఆత్మవిశ్వాసం ఆయన్ని ఆకాశమంత ఎత్తుకు చేర్చింది. నియోజకవర్గాల్లో రిజర్వేషన్లు ఉంటేనే దళితులకు రాజకీయంగా స్థానం లభిస్తుందని వాదించాడు. చివరకు అది సాధించాడు. అది అంబేద్కర్ విలువను ఇంకా పెంచింది.

అంబేద్కర్ అలుపెరగకుండా అలా ముందుకు సాగిపోతూ అనేక పదవులు నిర్వహించాడు. కుల నిర్మూలనపై పుస్తకం రాసాడు. రైతులు, కార్మికులు పేదల హక్కులపై పోరాడాడు. విజయాలు సాధించి, చివరకు అందరికీ ఆత్మీయుడయ్యాడు. ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే ఏదైనా సాధ్యం అని నిరూపించాడు.




Scanned with CamScanner

1947లో స్వాతంత్ర్యం సిద్ధించాక జవహర్‌లాల్‌నెహ్రూ తన మంత్రివర్గంలో అంబేద్కర్‌కి స్థానం ఇచ్చాడు. మన దేశానికి అవసరమైన రాజ్యాంగ చట్టాన్ని తయారుచేసే బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఇప్పుడు మనదేశంలో అమలులో ఉన్న రాజ్యాంగం అంబేద్కర్ రూపొందించిందే!

అంటరానితనాన్ని నిర్మూలించే నిబంధనను మన రాజ్యాంగంలో చేర్చారు.

అణగారిన ప్రజలకు ఊరట కలిగించారు.


గొప్ప సాంఘిక సంస్కరణను ఆత్మవిశ్వాసంతో పోరాడి సాధించాడు.



Scanned with CamScanner

బాలలూ! ఆనాడు అంబేద్కర్ అవమానాలకు బెదిరిపోయి, చదువుమానేసి ఉంటే ఈరోజున పరిస్థితి ఎలా ఉండేదో ఊహించండి. కాబట్టి మీరంతా కష్టపడి చదివి, ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించండి.

అపజయాలన్నింటినీ అవకాశాలుగా భావించి ముందుకు సాగాలంటే ఒక్కటే మార్గం. అదే ఆత్మవిశ్వాసం.



Scanned with CamScanner

## ఎదగడానికి ఏడుమెట్లు

ఎంత అందమైన బంగారు నగకైనా తయారీ సమయంలో కొలిమిలో కాలక తప్పదు. ఆపైన సుత్తి దెబ్బలు, సూది పొడుపులు కూడా తప్పవు. అప్పుడే అది అందమైన ఆభరణం అవుతుంది.

అదేవిధంగా బాలబాలికలు విజయం సాధించాలంటే ఏడు లక్షణాలు అలవాటు చేసుకోవాలి.

ఏ వ్యక్తికైనా విజయానికి మొదటి మెట్టు **క్రమశిక్షణ.** క్రమశిక్షణ కలవారు ఏ పనినైనా సాధించగలరు. దానికి తోడు **పట్టుదల** ఉంటే ఇక తిరుగులేదు.

విజయసాధనలో కొన్ని సమస్యలు తప్పవు. అదరక, బెదరక **మనోబలం**తో ముందుకు సాగాలి. కష్టాలు కలిగినప్పుడు ప్రయత్నం విరమించకూడదు. నిరుత్సాహపడకూడదు.

ఎన్ని అవాంతరాలు వచ్చినా **ఆత్మాభిమానం** వదలకూడదు.

మన విలువలు కాపాడుకోవాలి.

మనదేశానికి మనమేం చెయ్యగలమో ఆలోచించి **దేశభక్తి**తో ముందుకు సాగిపోవాలి.

విజయం అనేది గమ్యంకాదు. అదొక నిరంతర ప్రయాణం.

అందుకే ప్రతిక్షణం **స్వయంకృషి**తో ఎవరికివారే ప్రేరణ కలిగించు కుంటూ సాగిపోవాలి.

విజయానికి చివరి మెట్టు అయిన **ఆత్మవిశ్వాసం** మీ వైఖరిగా మారి చివరకు విజయం సాధించగలరు. విజయం మీదే.

ఎప్పుడూ మీతోనే ఉండే మీ



**Edagadaniki Edu metlu-7**
**AATMAVISWASAM**
by
**Dr. B.V. Pattabhi Ram**

Artwork by **Srikar**
Designed by **Purushoth Kumar**
Printed at **Ritunestham Press**, Hyd.

First Published in June, 2005
Third Edition March, 2015

Published by **EMESCO BOOKS**
1-2-7, Banoo Colony,
Domalguda, Hyderabad-29
Tel/Fax : 040-23264028
email : emescobooks@yahoo.com.
web : emescobooks.com.

ISBN 978-93-85231-42-1

రూ. 30/-

EBE034

Scanned with CamScanner